సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 86 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 20.07.2025

# ఓరుగల్లు దశాబ్దాల కలను సాకారం చేసిన మోడీ

- వచ్చే ఏడాది నుంచి కోచ్‌ల తయారీ
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో వేలాది మందికి ఉపాధి
- ఇక్కడ రైల్వే కోచ్‌లు, ఇంజిన్లతో పాటు మెట్రో రైళ్ల తయారీ
- కాజీపేటలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**వరంగల్, మన చౌరాస్తా :** నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కాజీపేటలో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం జరుగుతోందని, రైల్వే కోచ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ అనేక సంవత్సరాలుగా ప్రజల కలగా ఉందని, ఆ కలను సాకారం చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ అన్నారు. కాజీపేట అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో జరుగుతున్న పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డితో కలిసి ఆమన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అశ్వినీవైష్ణవ్ మాట్లాడుతూ.. రూ.500 కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు జరుగుతోందని, 2026 నాటికి ఈ యూనిట్ లో మాన్యుఫ్యాక్చరింగ్ ప్రారంభమవుతుందని అన్నారు. కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఒక మెగా ఫ్యాక్టరీగా రూపుదిద్దుకుంటోందని, ఇక్కడ రైల్వే కోచ్‌లు, ఇంజిన్లతో పాటు మెట్రో రైళ్ల తయారీ, డిజైన్ పనులు కూడా జరుగుతాయని ఆయన తెలిపారు. బహుళ రకాల రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ కార్యకలాపాలు ఇక్కడ కొనసాగుతాయని అన్నారు. ఈ ప్రాజెక్టు పురోగతిపై సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా ప్రజల తరపున, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున, ప్రధాని నరేంద్ర మోదీకి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు, అలాగే పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. తెలంగాణలో మొత్తం 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని, వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి కూడా అందులో భాగమేనని ఆయన పేర్కొన్నారు. వరంగల్‌లో రింగ్ రోడ్‌లో 50 శాతం పనులను కేంద్ర ప్రభుత్వం పూర్తిచేసింది. టెక్స్‌టైల్ ఇండస్ట్రీని మంజూరు చేసింది. వెయ్యి స్తంభాల గుడిలో మంటపాన్ని పునరుద్ధరించడం జరిగిందన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ అవసరం ఎంతో ఉందని తాను గత బీఆర్ఎస్ పాలన సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కు అనేకసార్లు లిఖితపూర్వకంగా విన్నవించానని, ఇప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఇదే విషయంపై విన్నవించానని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని సేకరించి సివిల్ ఏవియేషన్ మినిస్ట్రీకి అప్పగిస్తే, వరంగల్ ప్రజలకు విమాన రాకపోకల సౌకర్యం కలుగుతుందని మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణకు ఏం ఇచ్చారు? బీజేపీ ఏం తెచ్చింది? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అలాంటి వారు తమ కళ్లు తెరిచి చూడాలి, చెవులుంటే వినాలి. మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా చూడాలని నేను కోరుతున్నాను. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వయంగా కాజీపేటకు వచ్చి రైల్వే మాన్యుఫాక్చరింగ్ పనులను పర్యవేక్షించడం.. ఆయన రైల్వేల అభివృద్ధిపై చూపుతున్న నిబద్ధతకు నిదర్శనం. వందేభారత్ రైళ్లు, రైల్వేస్టేషన్ల అభివృద్ధి, రైల్వేల విస్తరణ.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో అశ్వినీ వైష్ణవ్ తెలంగాణ రైల్వేల ముఖచిత్రాన్ని మారుస్తున్నారు.. అని కిషన్‌రెడ్డి అన్నారు.

## వసతి గృహాల్లో కొత్త మెనూ అమలు చేయండి

- విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి
- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

2 పేజీ





## సెల్ ఫోన్ పోతే ఆందోళన వద్దు

3

- వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్



## దేశానికే ఆదర్శంగా తెలంగాణ

3

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



## భూతగాదాలో కత్తితో దాడి

2

- ఒకరికి తీవ్ర గాయాలు

# 'సొమ్ము ఒకరిది సోకు ఒకరిది'



**బచ్చనపేట, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు చేసింది ఏమీ లేదు.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే వాళ్లు ఏదో కొట్లాడితే వచ్చినట్లు కేసీఆర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు జంగిటి విద్యానాథ్ విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఇండ్లు ఇచ్చింది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అయితే తెచ్చింది బీఆర్ఎస్ అని చెప్పుకోవడము సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్లు ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి చొరవతో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులను చూసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం కానుందన్నారు.

# కొండమీది రాజన్‌బాబుకు పరామర్శ



**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలోని 40వ డివిజన్ ఉర్సు బొడ్రాయి ప్రాంతానికి చెందిన కన్నతల్లి ఫౌండేషన్, కన్నతల్లి వృద్ధాశ్రయమం చైర్మన్, మ్యాస్ తెలంగాణ వరంగల్ జిల్లా ఇంచార్జి కొండమీది రాజన్‌బాబు తల్లి కొండమీది అనంతమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకొని హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.కే.ప్రసన్న శనివారం రాజన్‌బాబును పరామర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ రాష్ట్ర సంఘం నాయకులు బంగారు అరుణ, రోహిణి దేవి , తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం మహిళ అధ్యక్షురాలు అనురాధ గౌడ్ , జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నూకల అంజి యాదవ్, లీడర్ బొల్లం రాజు పాల్గొన్నారు.



# కొత్త మెనూ అమలు చేయండి

- ప్రతి నెల మెడికల్ క్యాంప్స్ నిర్వహించాలి
- ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి
- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్




**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** కొత్తగా వచ్చిన మెనూను తప్పని సరిగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అధికారులకు ఆదేశించారు. శనివారం బచ్చన్నపేట మండలంలోని కేజీబీవీని జిల్లా విద్యాశాఖ అధికారులతో ఆయన పరిశీలించారు. వంట గదిని సందర్శించి విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. వండిన వెంటనే వేడి పదార్థాలను పిల్లలకు పెట్టించాలన్నారు. అదే విధంగా తాగునీరు కూడా వేడి చేసి చల్లార్చిన నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులు భోజనం చేసే డైనింగ్ హాల్‌ను చెక్ చేశారు. ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాణ్యమైన తాజాగా వండిన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలన్నారు. భోజనానికి వినియోగించే వస్తువులు కూడా నాణ్యమైన తప్పించుకోవాలని తాజా కాయగూరలను వినియోగించాలన్నారు. విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి మందులు పరిశీలించారు. పాము, కుక్క, కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రాత్రి వేళలో విద్యార్థినులను ఎట్టి పరిస్థితుల్లో బయటకు వెళ్లనీయ రాదని అన్నారు. విద్యార్థినులతో మాట్లాడారు. చక్కగా చదువుకోవాలని సమయాన్ని వృథా చేయరాదన్నారు. ఆరోగ్యంపై ఏ మాత్రం సందేహం ఉన్న వైద్య సిబ్బందికి తెలియజేసి తక్షణం వైద్యం పొందాలన్నారు. అనంతరం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కను నాటి విద్యార్థినిలకు స్ఫూర్తిని కలిగించారు. అనంతరం అదే మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్ని రకాల మందులు వైద్యశాలలో ముందస్తుగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,



జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు, డాక్టర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి : పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** వసతి గృహాల అధికారులు సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని స్థానికంగా నివాసం ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. వసతి గృహాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని, కొత్తగా చేరిన విద్యార్థులతో ఐకమత్యంగా మెలుగుతూ వారిని వసతి గృహానికి అలవాటయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని కల్పిస్తూ కొత్తగా చేరిన విద్యార్థుల పట్ల దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యంతో పాటు పరిశుభ్రత నిర్వహణ నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. జనగామ మండలంలోని యశ్వంతపూర్ గ్రామ పంచాయతీ లోని పోస్ట్ మెట్రిక్ బీసీ హాస్టల్‌ను శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి అధికారి రవీందర్‌తో కలిసి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించి పరిశీలించారు. వసతి గృహ నిర్వాహన తీరును పర్యవేక్షించిన అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు.





# భూతగాదాలో ఒకరికి గాయాలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** భూ తగాదాలో ఇద్దరు రైతుల మధ్య ఘర్షణ జరిగి కత్తితో దాడికి పాల్పడిన ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్ గ్రామానికి చెందిన మల్లం శ్రీశైలంకు, మల్లం శ్రీహరి తన కుమారుడు చిరంజీవి మధ్య వ్యవసాయ భూమి తగాదాలు గత కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. బచ్చన్నపేట శివారులోని ఉన్న తన వ్యవసాయ భూమిపై పలుమార్లు గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకున్న కూడా తీర్పు జరగకపోవడంతో బచ్చన్నపేట రెవెన్యూ శివారులో ఉన్న భూమిపై మల్లం శ్రీశైలం కోర్టు నుంచి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపారు. అయినా కూడా ఇరువురి మధ్యలో ఉన్న పొలం గెట్టును తొలగిస్తూ తమపై దుర్భాషలాడుతూ కత్తితో దాడి చేసినట్లు శ్రీశైలం తెలిపారు. చికిత్స నిమిత్తం బచ్చన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముందు జాగ్రత్తతో చేతి అడ్డుపెట్టడంతో ప్రాణాపాయం తప్పిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారితో మా కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్లో తమ భార్య మల్లం సరిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



# కనకదుర్గా కాలనీలో గోరింటాకు ఉత్సవాలు

**నల్లగొండ, మన చౌరాస్తా :** పట్టణంలోని కనకదుర్గా కాలనీలో మహిళా ఉద్యోగులకు ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి గోరింటాకు తెచ్చి దంచి నిర్వహించి ఒకరికొకరు పెట్టుకొని ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. అనంతరం శ్రీదేవి శారీస్ ఆధ్వర్యంలో సాంప్రదాయ బద్ధంగా ఉన్న వారికి బహుమతులు అందజేశారు.

# సెల్ ఫోన్ పోతే ఆందోళన వద్దు

- సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలి
- డీసీపీ రాజమహేంద్ర నాయక్
- 57 సెల్ ఫోన్లు రికవరీ

**జనగామ, మన చౌరాస్తా :** సెల్ ఫోన్లు పోగొట్టుకున్న భాధితులు ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచించారు. జనగామ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పోగొట్టుకున్న 57 సెల్ ఫోన్లు రికవరీ చేసి శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే, గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినా వారు వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్ ను నేరుగా బ్లాక్ చేయవచ్చన్నారు. ఒక వేల పోగొట్టుకున్న వ్యక్తులకు కంప్యూటర్ పరిజ్ఞానం లేనియెడల ప్రతి పోలీస్ స్టేషన్ లో ఒక పోలీసు అధికారిని ఈ పోర్టల్‌కు భాద్యతాధికారిగా నియమించినట్టు తెలిపారు. అతడిని పోలీసు స్టేషన్ కు వెళ్లి సంప్రదించాలన్నారు. ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోగొట్టుకున్న మొబైల్స్ రికవరీలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించినారు. సమావేశంలో ఏసీపీ చేతన్ నితిన్, జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





మన చౌరాస్తా 3
20.07.2025 ఆదివారం
Mana Chourasta




# దేశానికే ఆదర్శంగా తెలంగాణ

- ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాల అమలు
- పేద ప్రజల ఆకలి తీర్చిన కాంగ్రెస్
- 10 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం




**హనుమకొండ, మన చౌరాస్తా :** దేశంలో ఎక్కడా లేని ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేస్తన్న తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వేలేరు, ధర్మసాగర్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేసి కార్డుదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేలేరు మండలానికి సంబందించిన 9మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 3లక్షల 51వేల రూపాయల విలువ గల చెక్కులను, ధర్మసాగర్ మండలానికి సంబంధించిన 17మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 8లక్షల 01వెయ్యి 500 రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ 10 ఏళ్లు అధికారంలో ఉండి తెలంగాణ వనరులు దోచుకున్నారని ఆరోపించారు. వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయలను అవినీతి అక్రమాల ద్వారా కూడబెట్టుకొని ఇవాళ కేసులు ఎదుర్కొంటున్నది ఎవరని ప్రశ్నించారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోవాడనికి కారణమై కేసీఆర్ విచారణ ఎదుర్కొంటున్నాడు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా అనేక మంది జీవితాలను ఆగం చేసిన కేటీఆర్ విచారణ ఎదుర్కొంటున్నాడు. మద్యం కుంబకోణంలో జైలు ఊసలు లెక్కపెట్టి వచ్చింది కవిత ఇలా కుటుంబం మొత్తం కేసుల్లో ఇరుక్కొని మళ్లీ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కుటుంబం మొత్తం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వనరులను దోచుకున్న పాపానికి, తెలంగాణ ప్రజలను మోసంచేసిన పాపానికి ఎదో ఒక రోజు జైలు ఊసలు లెక్కపెట్టే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. హన్మకొండ జిల్లాలో 12 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, 25 వేల 349 మంది కొత్త సభ్యుల చేర్పులు జరిగాయాని, అలాగే వేలేరు మండలంలో 439 కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయాని, అలాగే 1006మంది పేర్ల చేర్పులు జరిగాయాని, అలాగే ధర్మసాగర్ మండలంలో 924కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని, 2119మంది పేర్ల చేర్పులు జరిగాయాని తెలిపారు. ఇంకా కొత్త రేషన్ కార్డు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏవిధమైన పరిమితులు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడివో తదితరులు పాల్గొన్నారు.



# జనగామలో క్రీడా సంబురాలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోషల్ వాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడ సంబురాల పేరుతో శనివారం క్రీడా పోటీలను నిర్వహించారు. మంగళంపల్లి రాజు నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను డాక్టర్ రాజమౌళి, డాక్టర్ ప్రీతి దయాల్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వల్ల విద్యార్థులు మానసికంగా శారీరకంగా దృఢంగా ఎదిగి జీవితంలో గొప్ప లక్ష్యాలను సాధిస్తారని అన్నారు. పాఠశాల విద్యార్థులు సమయం ఉన్నప్పుడు సెల్ ఫోన్లను పక్కకు పెట్టి క్రీడలకు క్రీడలకు సమయాన్ని కేటాయించాలని తెలిపారు. 8 పాఠశాలల విద్యార్థులు పాల్గొని మొదటి విభాగంలో వాలీబాల్ లో సెయింట్ మేరీస్ హై స్కూల్, త్రోబాల్లో స్కాలర్స్ హై స్కూల్ విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ నాయకులు సుభాష్, ఓయు జెఏసి నాయకులు కరుణాకర్, బిఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, నల్ల రాహుల్, సోషల్ వాయిస్ ఫౌండేషన్ సభ్యులు తుంగ కౌశిక్, బిట్ల చిన్న, మునిగే సురేష్, నరసింహ, భాస్కర్, శరత్, ప్రవీణ్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్‌ల పంపిణీ చేసిన విప్ బీర్ల

**యాదగిరిగుట్ట, మన చౌరాస్తా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లను పంపిణీ చేస్తూ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు బీర్ల శంకర్ తన సొంత నిధులతో హెల్మెట్లు పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, "ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం వల్లనే రక్షణ ఉంటుంది. హెల్మెట్ ఉపయోగించి ప్రశాంతమైన ప్రయాణం చేయండి" అంటూ ప్రజలకు సందేశమిచ్చారు. ప్రజలు రోడ్డు భద్రతను గౌరవించి, హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

# wanted

## విలేకరులు కావలెను







మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

*సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..*

# మన చౌరాస్తా

*The Complete News way*